క్లుప్తంగా

ఆట్యా-పాట్యా జిల్లా క్రీడాకారులకు శిక్షణ



నకరికల్లు: నైపుణ్యంతో కూడిన శిక్షణ పొంది రాష్ట్ర స్థాయిలో పల్నాడు జిల్లాకు మంచిపేరు తీసుకురావాలని ప్రధానోపాధ్యాయుడు జాలాది శ్రీనివాసరావు కోరారు. ఆట్యా-పాట్యా పల్నాడు జిల్లా బాలబాలికల జట్టు క్రీడాకారులకు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం శిక్షణనిచ్చారు. బాలికల జట్టుకు ఫిజికల్ డైరెక్టర్ రూన్సీరాణి, బాలుర జట్టుకు ఫిజికల్ డైరెక్టర్ చింతా పుల్లయ్యలు శిక్షణనిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒంగోలులో ఈ నెల 9, 10 తేదీలలో నిర్వహించే రాష్ట్ర స్థాయి ఆట్యా-పాట్యా పోటీల్లో పల్నాడు జిల్లా తరపున పాల్గొంటారని అన్నారు. అన్ని రకాల నైపుణ్యాలతో కూడిన శిక్షణను అందిస్తున్నామని, రాష్ట్ర స్థాయి పోటీల్లో విజయం సాధించే మెళకువలు నేర్పిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో పలువురు క్రీడా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం ఢీకొని వృద్ధుడు మృతి



రాజుపాలెం: ద్విచక్ర వాహనం గుర్తు తెలియని వృద్ధుడిని ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని రెడ్డిగూడెం సమీపంలో మాచర్ల-గుంటూరు రహదారిపై ఆదివారం రాత్రి జరిగింది. మృతుని వయస్సు సుమారు 70 ఏళ్లు ఉన్నట్లు ఎస్ఐ వేణుగోపాల్ తెలిపారు. మృతదేహాన్ని సత్తెనపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు తెలియజేశారు. వివరాల కొరకు 9440796168ను సంప్రదించాలని తెలిపారు.

బైబిల్ క్విజ్ పోటీలను జయప్రదం చేయండి

మాచర్ల: పల్నాడు జిల్లా బైబిల్ డిజిటల్ కాలేజి ఆధ్వర్యంలో మాచర్ల నియోజక వర్గంలో బైబిల్ క్విజ్ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు పాస్టర్లు శ్రీకాంత్, శంకర్ ఆదివారం తెలిపారు. రెంటచింతల మండలంలో ఆగస్టు 9న హౌస్ ప్రేయర్ చర్చిలో, ఆగస్టు 16న కారంపూడి సెయింట్ లూథరన్ చర్చిలో బైబిలు పోటీలు నిర్వహించటం జరుగుతుందన్నారు. ఈ పోటీల్లో పాల్గొన్న వారికి మొదటి బహుమతిగా రూ.3 వేలు, 2వ బహుమతిగా రూ.2 వేలు, మూడో బహుమతిగా రూ.వెయ్యి ఇవ్వనున్నట్లు తెలిపారు. వివరాలకు 6362218163, 6309118960లను సంప్రదించాలని కోరారు.

బావిలో పడి యువకుడు మృతి

మాచవరం: బావిలో పడి యువకుడు మృతి చెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన మహంకాళి దుర్గాప్రవీణ్(20) రెండు రోజుల నుంచి కనిపించకుండా పోయాడు. ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితుల వద్ద వెతికిన ప్రయోజనం లేదు. ఆదివారం ఉదయం గ్రామస్తులు బావి వద్దకు వెళ్లి చూడగా బావిలో శవమై కనిపించాడు. మతిస్థిమితం సరిగా లేనందున కాలుజారి బావిలో పడి ఉంటాడని భావిస్తున్నారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కూటమి నేతల మాయ మాటలు నమ్మవద్దు

సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు విజయ్‌కుమార్

నరసరావుపేట: నది దాటే వరకు ఓడ మల్లన్న, దాటాక బోడి మల్లన్న సామెత మాదిరి కూటమి పాలన ఉందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు గుంటూరు విజయ్‌కుమార్ విమర్శించారు. వామపక్షాలు, ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఈ నెల ఐదవ తేదీన మంగళవారం అన్ని విద్యుత్ సబ్‌స్టేషన్లు, సచివాలయాల వద్ద చేపట్టనున్న ధర్నాను విజయవంతం చేయాలని ఆయన కోరారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఆదివారం శ్రామిక మహిళ సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ డి.శివకుమారి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో విజయ్‌కుమార్ మాట్లాడారు. కూటమి ప్రభుత్వ ద్వంద్వ వైఖరిపై మండిపడ్డారు. గృహాలకు విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగించే ప్రతిపాదన విరమించుకోవాలని వామపక్షాలు, ప్రజా సంఘాలు, ప్రజలు పోరాటాలు చేస్తుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చోద్యం చూస్తున్నాయని తెలిపారు. గత ప్రభుత్వంలో విద్యుత్ స్మార్ట్ మీటర్లు పెడితే పగలగొట్టండని ప్రతిపక్షంలో ఉండగా నేటి మంత్రి నారా లోకేష్ ప్రజలకు పిలుపునిచ్చారని గుర్తుచేశారు. వీటి వలన ప్రజలకు నష్టం లేకపోతే ప్రతిపక్షంలో ఉండగా ఎందుకు వ్యతిరేకించారని ఆయన ప్రశ్నించారు. స్మార్ట్ మీటర్ ఇంటికి పెట్టడానికి అంగీకరిస్తే పులి బోనులో తలపెట్టినట్లేనని తెలిపారు. గతంలో జరిగిన విద్యుత్ ఉద్యమ ఫలితాన్ని గుర్తు చేసుకోవాలని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు ఉప్పలపాటి రంగయ్య, ఎంసీపీఐయూ జిల్లా కార్యదర్శి రెడ్ బాషా, సీఐటీయూ పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయులు నాయక్, రైతు సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి ఏపూరి గోపాలరావు, వివిధ సంఘాల నాయకులు సిలార్ మసూద్, సయ్యద్ రబ్బాని, కొమ్ముల నాగేశ్వరరావు, జిలాని మాలిక్ పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యం.. జారీలో జాప్యం

- కౌలు కార్డులు అందక ఆందోళనలో రైతులు
- వ్యవసాయ, రెవెన్యూ అధికారుల సమన్వయ లోపం
- ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా లేని గ్రామ సభలు



పత్తిలో కలుపు తీస్తున్న వ్యవసాయ కూలీలు

ముప్పాళ్ల: అన్నదాతలపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి కొనసాగిస్తూనే ఉంది. ఖరీఫ్ సీజన్ ఆరంభమై నెలన్నర కావస్తున్నా నేటికీ కౌలు రైతులకు గుర్తింపు కార్డుల జారీలో తీవ్ర అలసత్వం చూపిస్తోంది. ఫలితంగా సకాలంలో కార్డులందక బ్యాంకు రుణ సౌకర్యం కోల్పోవాల్సిన పరిస్థితి. 2025-26 సీజన్‌కు గాను మండలంలో 2,071 కౌలు రైతులకు గుర్తింపు కార్డులు లక్ష్యం కాగా ఇప్పటివరకు సుమారు 900 కార్డులు మాత్రమే పంపిణీ చేశారు. కార్డుల పంపిణీకి ఇప్పటివరకు గ్రామ సభలు నిర్వహించిన దాఖలాలు లేవు.

అధికారుల సమన్వయ లోపం...

సాధారణంగా పంటల సీజన్ మొదలవగానే కౌలు కార్డుల పంపిణీకి రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు సంయుక్తంగా గ్రామ సభలను ఏర్పాటు చేసి కౌలు రైతులను గుర్తించి కార్డులు మంజూరు చేస్తారు. కానీ అలాంటి ప్రక్రియ జరగడం లేదని రైతులు చెబుతున్నారు. దీంతో బయట వ్యక్తుల నుంచి అధిక వడ్డీలకు అప్పులు చేయాల్సిన దుస్థితి నెలకొందని కౌలు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సీజన్ ప్రారంభం కాగానే వ్యవసాయ అధికారులు మండల పరిధిలో ఉన్న కౌలు రైతుల జాబితాను గ్రామాల వారీగా సంబంధిత వీఆర్వోకు పంపిస్తారు. వీఆర్వో అప్రూవల్ చేసి తహసీల్దార్ లాగిన్ కు పంపించాల్సి ఉంటుంది. వ్యవసాయ శాఖ అధికారులు ఇప్పటికే అర్హుల జాబితాను తహసీల్దార్ కార్యాలయాలకు పంపామని, కార్డులు రెవెన్యూ శాఖ మంజూరు చేస్తుందని చెబుతున్నారు. అధికారుల మధ్య సమన్వయ లోపం కౌలు రైతులను ఇబ్బందులకు గురి చేస్తుంది.

ఆ నాలుగు గ్రామాల్లో లేనట్లేనా...

మండల పరిధిలోని బొల్లవరం, లంకెలకూరపాడు, దేచవరప్పాడు, నార్నెపాడు గ్రామాల్లో మొదటి విడత రీసర్వే పూర్తయింది. రైతుల నుంచి భూ సమస్యలు తలెత్తటంతో ఆన్‌లైన్ ప్రక్రియ చివరి దశలో నిలిచిపోయింది. దీంతో ఆయా గ్రామాల్లో సర్వే నెంబర్లు ఆన్‌లైన్‌లో కనిపించకపోవడంతో కౌలు కార్డుల మంజూరు నిలిచిపోయింది. స్థానిక రెవెన్యూ అధికారులు సమస్యను జిల్లా, డివిజన్ స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోవటంతో కౌలు కార్డుల మంజూరు ప్రక్రియ ఆ నాలుగు గ్రామాల్లో పూర్తిగా నిలిచిపోయింది. గత ప్రభుత్వం పైన అభాండాలు వేసేందుకే కౌలు రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏడాది గడిచినా కూటమి ప్రభుత్వం రీసర్వే జరిగిన గ్రామాల్లో రికార్డులను అప్‌డేట్ చేయకపోవడంతో నాలుగు గ్రామాల్లో దాదాపు 350 మందికి కౌలు కార్డులు లేనట్లేనని ఆందోళన చెందుతున్నారు.

వీఆర్వోలకు ఆదేశాలిచ్చాం

కౌలు కార్డుల జారీ ప్రక్రియ వేగవంతం చేయాలని సంబంధిత గ్రామాల వీఆర్వోలకు ఆదేశాలు ఇచ్చాం. అర్హులైన కౌలు రైతులకు సీసీఆర్సీ కార్డులు జారీ చేస్తాం. రీసర్వే పూర్తయిన గ్రామాలలో సాంకేతిక సమస్య నెలకొంది. సమస్యను జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. సమస్య పూర్తి కాగానే అర్హులందరికీ కార్డులు అందేలా చర్యలు చేపడతాం.

– కె.నగేష్, తహసీల్దార్

కార్డు ఉంటేనే రుణం



ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెల రోజులు దాటింది. కౌలు కార్డుల కోసం దరఖాస్తు చేస్తే రీసర్వే జరిగిన గ్రామ భూముల వివరాలు ఆన్‌లైన్‌లో కనిపించడం లేదని, రావటం ఆలస్యమవుతుందని చెబుతున్నారు. రుణం కోసం బ్యాంకుకు వెళితే కార్డు ఉంటేనే ఇస్తామంటున్నారు. ఏమి చెయ్యాలో తోచటం లేదు.

– కిష్టిపాటి సాంబిరెడ్డి, లంకెలకూరపాడు

సాగు ఎలా మొదలు పెట్టాలి



నేను బొల్లవరం రెవెన్యూ పరిధిలో పొలం సాగు చేస్తుంటాను. నాలుగేళ్లుగా ఆ పొలం మీదే కౌలు కార్డు తీసుకొని రైతు మిత్ర గ్రూపు ద్వారా బ్యాంక్‌లో లక్ష చొప్పున రుణం తీసుకుంటాం. గతేడాది లాగే ఈ ఏడాది కూడా బకాయి చెల్లిస్తే మరలా రుణం ఇస్తామని చెప్పటంతో కొంత అప్పుగా తెచ్చి బ్యాంక్‌లో కట్టాం. ఇప్పుడేమో ఆన్‌లైన్ రావటం లేదని కార్డులు ఇవ్వటం లేదు. సాగు ఎలా మొదలు పెట్టాలో తెలియడం లేదు.

– యు.రామకృష్ణారెడ్డి, చాగంటివారిపాలెం

గ్రామ సభలు నిర్వహించాలి



కౌలు రైతులకు అందించే సీసీఆర్సీ కార్డులపై గ్రామ సభలు నిర్వహించి అర్హులైన కౌలు రైతులను గుర్తించాలి. వ్యవసాయ, రెవెన్యూ శాఖలు సమన్వయంతో పనిచేసి అర్హులందరికీ కార్డులు అందించాల్సిన అవసరం ఉంది. అంతే కాకుండా కౌలు కార్డుదారులకు బ్యాంక్ రుణాలు కూడా అందేలా అధికారులు పనిచేయాలి. కౌలు కార్డు ఉన్న రైతుకు ప్రభుత్వ రాయితీలు, ప్రోత్సాహకాలు అందిస్తేనే కార్డు లక్ష్యం నెరవేరినట్టు.

– జి.బాలకృష్ణ, రైతు సంఘం నాయకులు

దొడ్లేరులో తల్లిపాల వారోత్సవాలు



దొడ్లేరు(క్రోసూరు): మండలంలోని దొడ్లేరు గ్రామంలో దొడ్లేరు సెక్టార్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రత్నకుమారి ఆధ్వర్యంలో ఆదివారం అంగన్‌వాడీ కేంద్రాలలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రత్నకుమారి బిడ్డలకు తల్లిపాల ఆవశ్యకతను తల్లులకు వివరించారు. పుట్టిన గంటలోపు నుంచి ఆరు మాసాల వరకు తల్లిపాలు మాత్రమే బిడ్డకు ఇవ్వాలని, దీంతో బిడ్డల్లో రోగనిరోధక శక్తి పెరిగి ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు జె.దానమ్మ, ఎం.సునీత, భూలక్ష్మీ, దుర్గాభవాని, పి.వెంకట్రావమ్మ, షాజిరా, మాణిక్యం, షేక్ రహానా, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, బాలింతలు పాల్గొన్నారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి

పిడుగురాళ్లరూరల్: కారు ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన పట్టణ శివారులోని కళ్లంటౌన్‌షిప్ వద్ద ఆదివారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. తెనాలికి చెందిన చిక్కా గోపి(55) గత 15 సంవత్సరాల నుంచి కారెంపూడిలో నివాసం ఉంటున్నాడు. అయితే రియల్ ఎస్టేట్ వ్యాపారం నిమిత్తం కారంపూడి, పిడుగురాళ్ల వస్తూ ఉండటం కుదరడం లేదని పట్టణంలోని కళ్లం టౌన్ షిప్‌లో ఓ ఫ్లాట్ తీసుకొని అద్దెకు ఉంటున్నాడు. అయితే ఆదివారం మధ్యాహ్న సమయంలో కళ్లం టౌన్ షిప్ నుంచి అద్దంకి నార్కెట్‌పల్లి హైవే ఎక్కుతుండగా గుంటూరు నుంచి హైదరాబాద్ వెళ్తున్న ఒక కారు చిక్కా గోపిని తప్పించబోయి డివైండర్‌ను ఢీకొని అటువైపు రహదారిలోకి వెళ్లింది. కానీ వెనుక నుంచి వస్తున్న ఇనోవా గోపిని ఢీకొనటంతో చిక్కా గోపి(55) అక్కడిక్కడే మృతి చెందాడు. పిడుగురాళ్ల పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీపీఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి వరప్రసాదరావు



కన్వీనింగ్ కమిటీ కన్వీనర్ రమేష్‌బాబు, పట్టణ కన్వీనర్ చెన్నకేశవరావు

సీపీఐ జిల్లా కార్యదర్శి వరప్రసాదరావు

సత్తెనపల్లి: పల్నాడు జిల్లాలో ఈ నెల 7, 8 తేదీల్లో జరిగే సీపీఐ పల్నాడు జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి వరప్రసాదరావు పిలుపునిచ్చారు. సత్తెనపల్లిలోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ నెల 7న వినుకొండ పట్టణంలో భారీ ర్యాలీ, బహిరంగ సభ జరుగుతాయన్నారు. బహిరంగ సభకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్ తదితరులు హాజరవుతారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలు, మోదీ అనుసరిస్తున్న ఆర్థిక విధానాలను విడనాడాలన్నారు. రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం, సూపర్ 6 పథకాలు అమలు చేయాలని, లేని పక్షంలో ప్రజా పోరాటాలకు సిద్ధమవుతామన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహాసభలో జిల్లా సమగ్రాభివృద్ధిపై చర్చించి పార్టీ భవిష్యత్తు ప్రణాళికలు రూపొందించేందుకు ఈ మహాసభలు ఎంతగానో దోహదపడతాయన్నారు. అనంతరం నియోజకవర్గ కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ కన్వీనర్‌గా ముసులూరు రమేష్‌బాబు, పట్టణ కన్వీనర్‌గా వల్లెం లక్ష్మీ, చెన్నకేశవరావుతోపాటు, 15 మందిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు షేక్ హుస్సేన్, తాతా రాంబాబు, అరసం రాష్ట్ర నాయకుడు శరత్‌చంద్ర జ్యోతిశ్రీ, సుభాని, నరసింహారావు, రోశయ్య, ఆర్.శేషయ్య, సీపీఐ నాయకులు కంబాల శ్రీనివాసరావు, మస్తాన్, వెంకటలక్ష్మి, తిరుపతమ్మ, కోటా రామతిరుపతి రావు తదితరులు పాల్గొన్నారు.

పాత భవనం... దినదిన గండం



ప్రమాదంగా ఉన్న పెదకూరపాడు ఎంఈవో కార్యాలయం



పెచ్చులూడుతూ కూలేందుకు సిద్ధంగా ఉన్న కచేరి సెంటర్



శిథిలమైన పోలీసు క్వార్టర్లు

ఒకప్పుడు నిత్యం ప్రజలతో కళకళలాడిన ప్రభుత్వ భవనాలు నేడు పూర్తిగా శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారాయి. ఎప్పుడు కూలిపోతాయో తెలియని పరిస్థితిలో ఉన్నాయి. ఏళ్ల తరబడి ఇలా నిరుపయోగంగా ఉన్న పాత భవనాలను కూల్చేందుకు అధికారులు ముందుకు రావడం లేదు. పెదకూరపాడు ప్రధాన సెంటర్‌లోని కచేరి సెంటర్ గత దశాబ్ద కాలంగా శిథిలావస్థకు చేరి నిరుపయోగంగా ఉంది. నిత్యం జన సంచారం ఉండే ఈ కచేరి సెంటర్‌లో వ్యాపారాలు, పలు గ్రామాలకు వెళ్లే విద్యార్థులు, ప్రయాణికులు నిలిచి ఉంటారు. ఈ భవనం పెచ్చులూడుతూ ప్రమాదం ఉంది. తహసీల్దార్ కార్యాలయంకు వెళ్లే రహదారిలో గ్రామ రెవెన్యూ కార్యాలయం కూడా ఇదే పరిస్థితిలో ఉంది. పెదకూరపాడు పోలీసు క్వార్టర్లు కూడా గత రెండు దశాబ్దాల కాలంగా నిరుపయోగంగా ఉన్నాయి. మండల విద్యావనరుల భవనం గోడలు పగుళ్లు ఇచ్చి, పెచ్చులూడుతూ ఎప్పుడు కూలిపోతుందోనని ప్రమాదకరంగా ఉండడంతో అక్కడ దాదాపు ఏడాదిగా విధులు నిర్వహించడం లేదు. ఇక్కడ ఉన్న జేబీ పాఠశాల విద్యార్థులు, భవిత కేంద్రం చిన్నారులు భయం గుప్పెట్లో బిక్కుబిక్కుమంటున్నారు. కాలచక్ర రహదారిలోని ఎస్సీ బాలికల వసతి గృహం ప్రమాదకరంగా ఉంది. ఈ పాత భవనాలు శిథిలావస్థకు చేరడంతో ఎలాంటి విధులు నిర్వహించడం లేదు. కానీ దినదిన గండంగా కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. అధికారులు నిరుపయోగంగా ఉండి ప్రమాదకరంగా ఉన్న పాత భవనాలను కూల్చివేయాలని ప్రజలు వేడుకుంటున్నారు.

- పెదకూరపాడు

గుర్రం జాషువా లా చాంబర్స్ కార్యాలయం ప్రారంభం



వినుకొండ: పట్టణంలోని రైల్వేస్టేషను రోడ్డులో ఆదివారం గుర్రం జాషువా లా చాంబర్స్ నూతన కార్యాలయాన్ని మాజీ మంత్రి, న్యాయవాది డొక్కా మాణిక్య వరప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాషువా పేరుతో నూతనంగా కార్యాలయంకు కృషి చేసిన న్యాయవాదులు అప్పరాజు అపర్ణాదేవి, పరిశపోగు రాహుల్ అంబేద్కర్, కాకాని నాగేశ్వరరావు, జాషువాలను అభినందించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీనివాసరావు, సైదారావు, మూర్తి, గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

అదానీ స్మార్ట్ మీటర్లు ఇళ్లకు బిగించవద్దు

ఇంటింటి సంతకాల సేకరణ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు



సంతకాల సేకరణలో రైతు సంఘ నాయకులు

సత్తెనపల్లి: అదానీ విద్యుత్ స్మార్ట్ మీటర్లు ఇళ్లకు బిగించవద్దని పాత మీటర్లని కొనసాగించాలని, పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని రైతు సంఘం నాయకుడు ఇంజం లింగయ్య అన్నారు. ఆదివారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలో పాత బస్టాండ్ 28వ వార్డు జెండా చెట్టు ప్రాంతంలో ఇంటింటికీ వెళ్లి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగించడానికి అదానీ కంపెనీ సిబ్బంది ఇళ్లకు వస్తున్నారని వారిని స్థానిక ప్రజలు, గృహ యజమానులు అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. ఈ స్మార్ట్ మీటర్లు ఇప్పటికే షాపులకు, పరిశ్రమలకు బిగించారని, వీటి వలన బిల్లులు విపరీతంగా పెరుగుతున్నాయన్నారు. స్మార్ట్ మీటర్లు పూర్తిగా అమల్లోకి వస్తే సెల్ ఫోన్లు చార్జింగ్ చేసుకున్నట్లుగా ముందుగా డబ్బు చెల్లించి రీచార్జి చేయించుకోవాలన్నారు. బ్యాలెన్స్ అయిపోతే కరెంటు సరఫరా ఆగిపోతుందన్నారు. తిరిగి విద్యుత్ కావాలనుకుంటే రీచార్జి చేయించుకోవాల్సి వస్తుందన్నారు. అంతే కాక విద్యుత్ వాడుకునే డిమాండ్‌ను బట్టి ఉదయం ఒక రేటు, మధ్యాహ్నం ఒక రేటు, సాయంత్రం మరొక రేటు ఇలా రేట్లు పెరుగుతాయని హెచ్చరించారు. ఇలాంటి విద్యుత్ స్మార్ట్ మీటర్లు మనకు తగినవి కావని పాత మీటర్లనే కొనసాగించాలని, అదానీ కంపెనీ సిబ్బందిని అడ్డుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. సీపీఎం మీకు అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు డి.విమల, గుంటుపల్లి రజని, తుమ్మల లక్ష్మీ, గింజుపల్లి నాగలక్ష్మి, షేక్ సాయిబా, షేక్ సైదులు, వనమా రామారావు తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లపై నిరసనను జయప్రదం చేయండి

అమరావతి: ఈ నెల 5వ తేదీన విద్యుత్ కార్యాలయం వద్ద వామపక్షాలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి బి.సూరిబాబు అన్నారు. ఆదివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలపై పాత బకాయిల పేరుతో భారం వేసి ఇబ్బంది పెడతుందన్నారు. ఇప్పటికే రూ.15 వేల కోట్లకు పైగా విద్యుత్ భారాన్ని ప్రజలపై మోపి, ట్రూ అప్ చార్జీల పేరుతో మరో రూ.12 వేల కోట్లకు పైగా భారం మోపడానికి రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ డిస్కమ్‌లకు లేఖ రాయటం దారుణమన్నారు. అదానీ స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసి వ్యాపారస్తులను దోపిడీ చేస్తుందన్నారు. రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి రవికుమార్ గృహ వినియోగదారుల అనుమతి లేకుండా స్మార్ట్ మీటర్ బిగించవద్దని ప్రకటన చేసి చేతులు దులుపుకున్నారని, ప్రకటన కాకుండా జీవో జారీ చేయాలని డిమాండ్ చేశారు. గృహ వినియోగదారులు ఇళ్ల వద్ద లేని సమయంలో ఇంటి బయట ఉన్న మీటర్ల స్థానంలో స్మార్ట్ మీటర్లు బిగించటం ఘోరమైన తప్పిదమన్నారు. ఇలా జరిగితే ఏఈకి ఫిర్యాదు చేయాలన్నారు. విద్యుత్ చార్జీలు తగ్గించకపోతే మరో విద్యుత్ బషీర్‌బాగ్ తప్పదన్నారు. స్మార్ట్ మీటర్లపై రాష్ట్ర వ్యాప్తంగా పోరాటం చేసి కూటమి ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ సమావేశంలో సయ్యద్ మొహిద్దీన్‌వలి, పి సత్యనారాయణ, ఎస్ కే రఫీ, ఎస్కే నాగుల్ మీరా, కే ఏషియా, కే మధు, తోకల సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.



మాదలలో సంతకాల సేకరణలో సీపీఎం నాయకులు



మాట్లాడుతున్న సూరిబాబు

స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా సంతకాల సేకరణ

మాదల(ముప్పాళ్ల): మండలంలోని మాదల, నార్నెపాడు గ్రామాలలో సీపీఎం ఆధ్వర్యంలో స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ఆదివారం సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న సీపీఎం మండల కార్యదర్శి గుంటుపల్లి బాలకృష్ణ మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ పెడితే విద్యుత్ బిల్లులు అధికంగా వస్తాయని, ఒకే రోజులో మూడు శ్లాబ్‌లుగా రేట్లు ఉండి భారంగా మారతాయన్నారు. మీటరు బిగించడానికి వచ్చిన వారిని సామూహికంగా అడ్డుకోవాలని చెప్పారు. పాత మీటర్లే కొనసాగించాలని జరిగే ఈ ఉద్యమంలో అందరూ భాగస్వాములు కావాలన్నారు. ఈ నెల 5వ తేదీన అన్ని గ్రామ సచివాలయాల వద్ద జరిగే ధర్నా కార్యక్రమం విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు చింతపల్లి నాగమల్లేశ్వరరావు, గారా జాలయ్య, తోట బ్రహ్మయ్య, పఠాన్ సైదాఖాన్, వెంకటేశ్వర్లు, ప్రభాకరరావు, అప్పారావు, తొండపి మస్తాన్‌రావు, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు ఆపన్నహస్తం



పెదకూరపాడు (అచ్చంపేట): స్నేహహస్తాలు ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న అక్షర సేద్యంలో భాగంగా కో-ఫౌండర్ శివరాం కూరపాటి, ఎంపీ లావు శ్రీకష్ణ దేవరాయలు చేతుల మీదుగా ఆదివారం స్కాలర్‌షిప్స్ పంపిణీ చేశారు. తిరుపతి ఎస్వీ యూనివర్సిటీలో ఎంబీబీఎస్ 3వ సంవత్సరం చదువుతున్న సీహెచ్ బిందుశ్రీకి రూ.98,000 చెక్కును, వి/ఫ్లాన్‌లారా ఇంజనీరింగ్ కాలేజిలో బీటెక్, (ఎస్‌సీఈ) 3వ సంవత్సరం చదువుతున్న సత్తెనపల్లికి చెందిన మునగా భావనకు రూ.45,000 చెక్కును, వీఐటీ, అమరావతిలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్న అచ్చంపేట మండలం ఓర్వకల్లు గ్రామానికి చెందిన పూల గౌతమ్‌కు రూ.60,000 చెక్కును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ మారుతున్న కాలానికి తగ్గట్టుగా విద్యార్థులు ఏఐ, క్వాంటమ్ కంప్యూటరింగ్‌లో నిష్ణాతులుగా మారాలని, నైపుణ్యంలో గ్రామీణ విద్యార్థులు అన్ని అవకాశాలు అందిపుచ్చుకుని రాణించాలని, దానికి.. స్నేహ హస్తాలు ఫౌండేషన్ అద్భుతమైన కృషి చేస్తుందని కొనియాడారు. రాబోయే రోజుల్లో మరిన్ని కార్యక్రమాలు చేయాలని, గ్రామీణ విద్యార్థులకు మరిన్ని సేవలు అందించాలని ఆశిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో మన్నెం భద్రయ్య, స్నేహహస్తాలు కో ఆర్డినేటర్ తాయి కరిముల్లా బాబు పాల్గొన్నారు.

గూడ్సు రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

వినుకొండ: గూడ్సు రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన వినుకొండ రైల్వే స్టేషను సమీపంలో ఆదివారం ఉదయం జరిగింది. మృతుడిని పట్టణంలోని శృంగారపువనానికి చెందిన నేలవరపు సతీష్ (30)గా రైల్వే పోలీసులు గుర్తించారు. వినుకొండ ప్రభుత్వ వైద్యశాలలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడికి భార్య ఉంది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ముగిసిన రణ అంకమ్మ తల్లి కొలుపులు



నరసరావుపేట రూరల్: మండలంలోని జొన్నలగడ్డలో రణ అంకమ్మ తల్లి కొలుపులు ఘనంగా ముగిశాయి. గుమ్మడిదల ఇలవేల్పుగా పూజలందుకున్న రణ అంకమ్మ తల్లి కొలుపులను గత 30వ తేదీ నుంచి ఆలయంలో నిర్వహిస్తున్నారు. ఆదివారం కొలుపుల ముగింపులో వైఎస్సార్ సీపీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పాల్గొని, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు జరిపారు. మధ్యాహ్నం ఆలయ నిర్వాహకులు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు దొండేటి అప్పిరెడ్డి, నల్లగంగుల యజ్ఞారెడ్డి, గ్రామస్తులు గుమ్మడిదల శివ, బీరం భాస్కరరెడ్డి, కొల్ల వెంకటనారాయణ, కుందా యాకోబు, చంటి, భాస్కరరెడ్డి పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 25439 (సత్తెనపల్లి)
90100 01840 (పెదకూరపాడు)
Office mail : sakshigntadvt@gmail.com